www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 18 జులై 2025
5
ఏలూరు

స్కూల్ బస్సులు, ఆటోలు తనిఖీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పట్టణంలో పాఠశాలకు వెళ్లే పిల్లల క్షేమం, భద్రత నిమిత్తం ఉదయాన్నే వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టినట్లు సిఐ వెంకట సుభాష్ తెలిపారు. విద్యార్థులను పాఠశాలకు తరలించే బస్, ఆటో డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. పరిమితికి మించి ఎక్కువమంది పిల్లలను తరలించే వాహనదారులకు పిల్లల భద్రత క్షేమంపై తగు సూచనలు ఇచ్చామని చెప్పారు. మద్యపానం సేవించి స్కూల్ బస్సులు నడపవద్దని హెచ్చరించారు. ఎవరైనా మద్యపానం సేవించి స్కూల్ బస్సులు, ఆటోలు నడిపితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్సు లేకుండా ఎవరూ కూడా స్కూల్ బస్సులు నడపొద్దని చెప్పారు. స్కూల్ బస్సులు నడిపే వారికి తగు జాగ్రత్తలు వివరించారు. నేటి బాలలే రేపటి పౌరులని, వారిని తీర్చిదిద్దే బాధ్యత మనందరికీ ఉందన్నారు. డ్రైవర్లు వుంతగా వారిని క్షేమంగా స్కూల్ నుంచి ఇంటికి, ఇంటి నుంచి స్కూలుకి జాగ్రత్తగా చేరవేయాలని తెలియజేశారు.

బదిలీల గారడీ..!

ఇంకా పూర్తికాని సచివాలయ ఉద్యోగుల బదిలీలు

ఇష్టానుసారంగా అధికారుల వ్యవహార శైలి

పదేపదే జాబితాలు మారుస్తూ ఉద్యోగులకు నరకం

ఏఒక్క నిబంధనా పాటించకుండా అడ్డగోలుగా ముందుకు

రెండు జిల్లాల్లో 8 వేల మందికిపైగా ఉద్యోగులతో ఆటలు

ప్రేక్షక పాత్రకు పరిమితమైన ఇరు జిల్లాల కలెక్టర్లు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల వ్యవహారం గారడీగా మారింది. నిబంధనలు, జిఒలతో సంబంధం లేకుండా జిల్లా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు ఇలా ఏఒక్క విభాగంలోనూ బదిలీల పర్వం సాఫీగా సాగిన పరిస్థితి లేదు. జాబితాలు విడుదల చేయడం, మళ్లీ వెనక్కి తీసుకోవడం, ఒకసారి ఒకస్థానం, మరోసారి ఇంకోస్థానానికి బదిలీ చేస్తూ అడ్డగోలుగా వ్యవహరించిన పరిస్థితి కన్పించింది. ఈ నెల ఐదో తేదీకి పూర్తికావాల్సిన సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ నేటికీ కొనసాగుతుండటం గమనార్హం. ఇప్పటికీ సచివాలయ ఉద్యోగులు ఆయా శాఖల కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1100కుపైగా గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా, 8,500 మందికిపైగా ఉద్యోగులు 11 శాఖలకు సంబంధించి ఉన్నారు. జూన్ 12న సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియకు నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. జూన్ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించింది. పూర్తి కాకపోవడంతో జులై ఐదో తేదీకి పూర్తి చేయాలని చెప్పింది. అయితే ఇప్పటికీ పూర్తికాని పరిస్థితి నెలకొంది. సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీల విషయంలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులు సరిగా చేయలేదని తొలుత విడుదల చేసిన జాబితాను నిలిపివేసి జిల్లా పరిషత్ అధికారులకు అప్పగించారు. జిల్లా పరిషత్ అధికారులు రూపొందించిన జాబితా సైతం ఇష్టానుసారంగా ఉందనే విమర్శలు వెల్లువెత్తాయి. తొలి జాబితాలో వచ్చిన స్థానాలు మార్చేసి ఇష్టానుసారంగా స్థానాలు కేటాయించడంపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మహిళా పోలీసులకు సంబంధించి సైతం జాబితా విడుదల చేసి నిలిపివేసి మరోసారి ప్రక్రియ నిర్వహించారు. డిజిటల్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంల బదిలీలకు సంబంధించి అనేక ఇబ్బందులు వచ్చాయి. బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అధికారులెవ్వరూ పాటించలేదు. వికలాంగులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు, స్పౌజ్ కేటగిరి సరిగా అమలు చేయలేదు. ప్రజాప్రతినిధులు చెప్పారంటూ అడ్డగోలుగా ముందుకు సాగారు. దీంతో ఇప్పటికీ సచివాలయ ఉద్యోగులు పిజిఆర్ఎస్‌కు వచ్చి జిల్లా అధికారులను కలుస్తున్నారు. ఆయా శాఖల కార్యాలయాల వద్ద సచివాలయ ఉద్యోగులు పడిగాపులు కాస్తున్న పరిస్థితి ఉంది. మంచి ర్యాంకు ఉన్నా వందల కిలోమీటర్ల దూరంలో వేశారని, సరైన ర్యాంకు లేనివారికి మంచిస్థానాలు కేటాయించారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. సచివాలయ ఉద్యోగుల బదిలీల వ్యవహారంలో కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలు పాటించకుండా అధికారులు వ్యవహరించిన తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ప్రేక్షక పాత్రకు పరిమితమైన జిల్లా కలెక్టర్లు

సచివాలయ ఉద్యోగుల బదిలీల వ్యవహారం అడ్డగోలుగా సాగుతున్నా, ఇరు జిల్లాల కలెక్టర్లు పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్లకు కలెక్టర్లు సైతం తలొగ్గారనే చర్చ ఉద్యోగుల్లో సాగుతోంది. ప్రభుత్వ నిబంధనలు పాటించాలంటూ అధికారులకు జిల్లా కలెక్టర్లు ఎందుకు ఆదేశాలు ఇవ్వలేదనే ప్రశ్నకు సమాధానం లేకుండాపోయింది. వేలాది మంది ఉద్యోగులతో అధికారులు బంతాట ఆడుకున్న పరిస్థితి ఉంది. జిల్లా అడ్మినిస్ట్రేషన్‌లో ఏర్పడిన సమస్యలను పరిష్కరించడంలో కలెక్టర్లు సరైన చొరవ చూపడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా సచివాలయ ఉద్యోగుల బాధలు పట్టించుకోవాలని అంతా కోరుతున్నారు. లేకపోతే భవిష్యత్తులోనూ బదిలీల వ్యవహారం అడ్డదిడ్డంగా నడిచే పరిస్థితి ఉంది.

నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న ఎంఇఒ శ్రీనివాసరావు

ఫలించిన విద్యార్థుల దీక్షలు

4 రోజుల్లో ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి డిఇఒ హామీ

సమస్య పరిష్కరించకుంటే మళ్లీ పోరాటం

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

వివిధ మండలాల్లోని పాఠశాలల్లో ఖాళీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన విద్యార్థులు చేపట్టిన దీక్షలు ఫలించాయి. నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని డిఇఒ హామీ ఇవ్వడంతో విద్యార్థులు గురువారం దీక్షలు విరమించారు. మండలంలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండు రోజులుగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన విద్యార్థులు రిలేదీక్షలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ దీక్షలకు సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్, వైసిపి, సిఐటియు, ఎపి గిరిజన సంఘం నేతలు సంఘీభావం తెలిపి దీక్షల్లో పాల్గొని సంఘీభావం తెలిపారు. విషయం తెలుసుకున్న డిఇఒ దీక్షా శిబిరం వద్దకు ఎంఇఒను పంపారు. ఎంఇఒ సమస్యలు అడిగి తెలుసుకుని డిఇఒకు ఫోన్ చేసి నేతలతో మాట్లాడించారు. ఈ సందర్భంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను నాలుగు రోజుల్లో భర్తీ చేసి సమస్యను పరిష్కరిస్తామని డిఇఒ హామీ ఇచ్చారు. దీక్షలను విరమించాలని కోరారు. ఇప్పటికే డిప్యుటేషన్లకు కసరత్తు చేస్తున్నామని, డైరెక్టర్‌తో మాట్లాడి విద్యా వాలంటీర్ల నియామకం కూడా చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో నేతలు దీక్షలు విరమిస్తున్నట్లు ప్రకటించారు. దీక్షాధారులకు ఎంఇఒ శ్రీనివాసరావు దీక్ష నిమ్మరసం ఇచ్చి రిలే దీక్షలను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ డిఇఒ హామీ మేరకు దీక్షలను తాత్కాలికంగా విరమిస్తున్నామన్నారు. ఇచ్చిన హామీ అమలు చేయకపోతే నాలుగు రోజుల తర్వాత ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యార్థుల విద్య అందని ద్రాక్షగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న ప్రభుత్వ నేతలు ఏజెన్సీ ప్రాంతంలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఈ దీక్షల్లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, మండల కార్యదర్శి భయ్యాల శ్రీను, నేతలు మేడేపల్లి బాబు, పుల దాసు రమేష్, షేక్ వలీపాషా, సిపిఐ మండల కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వడ్డే రఘు, మండలాధ్యక్షులు గజ్జ రాజులు, నేత వీరయ్య, సిఐటియు మండల కార్యదర్శి యర్రం సాయిరెడ్డి, వైసిపి నియోజకవర్గ నాయకులు మల్లెల చంటినాయుడు, మండల ఉపాధ్యక్షులు రాయి సత్యనారాయణ, సిపిఐ (ఎంఎల్) మండల నాయకులు కల్లయ్య, గిరిజన సంఘం నాయకులు పట్ల లక్ష్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


పొట్టిపాడులో నీరందక ఎండిపోతున్న దుక్కి దున్నిన పొలం

ఎండుతున్న నారుమళ్లు.. పొలాల్లో బీటలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

దొంతవరం, పొట్టిపాడు తదితర గ్రామాల్లో నీరందక దమ్ము చేసిన పొలాలు, నారుమళ్లు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. గోదావరి జలాలు కాగుపాడు మిడ్‌లెవెల్ ఛానల్ ద్వారా డెల్టా పొలాలకు చేరాల్సి ఉంది. ఈ క్రమంలో దొంతవరం పంట కాలువ కింద పొట్టిపాడు, రావులపర్రు, రాచూరు, సీతారామపురం, దొంతవరం గ్రామాల్లో 600 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. గడిచిన కొద్ది రోజులుగా సాగునీరు లోలెవెల్‌లో ఉండటం వల్ల నారుమళ్లకు నీరందడం లేదు. దీనికి తోడు విపరీతమైన ఎండల కారణంగా చేలల్లో ఉన్న కొద్దిపాటి నీరు సైతం ఆవిరై మడులు బీటలు వారాయి. మిడ్‌లెవెల్ ఛానల్ ఉత్తర బోదె కింద సాగులో ఉన్న పొలాలకే ఈ పరిస్థితి నెలకొంది. మిగిలిన పంట కాలువలకు నీరు పుష్కలంగానే ఉంది. అయితే పంట కాలువలో పూడిక తీసి దిగువకు నీటిని తరలించాలని బోదెలను ఏర్పాటు చేయాల్సి ఉంది. నీరందక దమ్ము చేసిన చేలు ఎండిపోతున్నాయని, మళ్లీ నీళ్లు పెట్టి దక్కి దున్ని దమ్ము చేయాలంటే అదనపు ఖర్చవుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులకు కష్ట, నష్టాలు తప్పడం లేదని నీటిసంఘం మాజీ అధ్యక్షుడు పడవల మహంకాళిరావు అన్నారు.

ట్రిపుల్ ఐటిలో రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం

కౌన్సెలింగ్‌కు విచ్చేసిన విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటిలో రెండో విడత కౌన్సెలింగ్ గురువారం మొదలైంది. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌ల్లో మొదటి విడత కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్లకు గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి నూజివీడు క్యాంపస్‌లోని ఆడిటోరియంలో రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభమైంది. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఏ విధమైన అసౌకర్యమూ కలగకుండా యూనివర్సిటీ అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. నూజివీడు బస్టాండ్ నుంచి క్యాంపస్‌కు చేరుకోవడానికి బస్సు ఏర్పాటు చేశారు. రెండో విడత కౌన్సెలింగ్‌కు 803 మందికి కాల్ లెటర్స్ పంపించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 90 శాతానికిపైగా విద్యార్థులు అడ్మిషన్లు పొందడం విశేషమన్నారు. అందులో 70 శాతానికిపైగా అమ్మాయిలు ఉన్నారని తెలిపారు. చదువులో ముందంజలో ఉంటూ ప్లేస్‌మెంట్‌లు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ డాక్టర్ లక్ష్మణరావు, అకడమిక్ డీన్ డాక్టర్ చిరంజీవి, ప్రొఫెసర్ గోపాలరాజు, అకడమిక్ అసోసియేట్ డీన్స్, అధ్యాపకులు పాల్గొన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను అసిస్టెంట్ రిజిస్ట్రార్ అర్జునరావు పర్యవేక్షించారు.

గిరిజనుడుపై అకారణంగా దాడి అన్యాయం

బుట్టాయగూడెం ఎస్ఐను సస్పెండ్ చేయాలి

సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం నేతల డిమాండ్

బాధితుడిని పరామర్శిస్తున్న నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని వీరన్న పాలెం గ్రామానికి చెందిన గిరిజనుడు గుజ్జు లక్ష్ముడుని విచారణ పేరుతో స్టేషన్‌కు తీసుకొచ్చి విచక్షణారహితంగా కొట్టిన బుట్టాయగూడెం ఎస్ఐ దుర్గామల్లేశ్వరరావుపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లక్ష్ముడుకి మెరుగైన చికిత్స అందించడంతోపాటు న్యాయం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మొడియం నాగమణి డిమాండ్ చేశారు. బుట్టాయగూడెం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్ముడుని నేతలు గురువారం పరామర్శించారు. ఆస్పత్రి ఆవరణలో పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రామకృష్ణ, నాగమణి మాట్లాడుతూ బుట్టాయగూడెం ఎస్ఐను వెంటనే సస్పెండ్ చేయాలని, ఎస్ఐ దుర్గా మహేశ్వరరావుపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. లేనిపక్షంలో లేనిపక్షంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఒకపక్క ఫ్రెండ్లీ పోలీస్ అంటూనే మరోపక్క విచారణ పేరుతో స్టేషన్‌కు పిలిచి విచక్షణారహితంగా కొట్టడం దారుణన్నారు. ఇటువంటి ఘటనలు తరచూ బుట్టాయగూడెం స్టేషన్లో చోటుచేసుకుంటున్నాయని, పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి దీనిపై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు పోలోజు నాగేశ్వరరావు, కారం భాస్కరరావు, చంద్రు బుల్లమ్మ, తామా ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐపై కఠిన చర్యలు తీసుకోవాలి: సిపిఎం

ఏలూరు అర్బన్: విచారణ పేరుతో గిరిజనులపై దాడి చేసిన బుట్టాయగూడెం ఎస్ఐపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుట్టాయగూడెం మండలం వీరన్నపాలేనికి చెందిన గుజ్జు మహేంద్రపై అదే గ్రామానికి చెందిన కొంతమంది మహిళలు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ పేరుతో ఆ యువకునిపైనా, అతని తండ్రి గుజ్జు లక్ష్ముడుపై, సోదరుడు రాజుపై విచక్షణారహితంగా ఎస్ఐ దాడి చేసి గాయపరచడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గిరిజనులపై దాడి చేసిన ఎస్ఐపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రవి డిమాండ్ చేశారు. గిరిజనుడు తప్పు చేసి ఉంటే చట్టప్రకారం కేసు నమోదు చేసి కోర్టుకు పంపాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని విచక్షణారహితంగా దాడి చేయడం తగదని పేర్కొన్నారు. ఎస్ఐపై పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

గూడెంలో భారీ వర్షం..

మెయిన్ రోడ్డులో పడుతున్న వర్షం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పట్టణం, పరిసర ప్రాంతాలలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి భారీ వర్షం కురిసింది. ప్రతిరోజు ఎండ తీవ్రత తట్టుకోలేని ప్రజలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో ఉక్కపోత నుంచి ఉపశమనం లభించిందని ఆనందపడ్డారు. వర్షానికి పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

పాత పెన్షన్ విధానాన్ని మంజూరు చేయాలి

నేడు కలెక్టరేట్ వద్ద నిరసన

ఏలూరు అర్బన్ : డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వెంటనే మంజూరు చేయాలని కోరుతూ డిఎస్‌సి 2003 టీచర్స్ ఫోరమ్ ఈనెల 18న ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫోరం రాష్ట్ర కన్వీనర్ కట్టా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి హాజరవుతున్నారనీ, యుటిఎఫ్, ఎపియుటిఎఫ్, ఎస్‌టియు, ఎపిటిఎఫ్ సంఘాలతో పాటు ఇతర అన్ని సంఘాలు మద్దతు తెలియజేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులందరూ పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

45 మంది విద్యార్థుల రక్తదానం

రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్

ఏలూరు అర్బన్ : సర్ సిఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 45 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి .ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చునని, రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేము కనుక స్వచ్ఛంద రక్తదానం ఒకటే రక్తానికి ప్రత్యామ్నాయమని అన్నారు. కాబట్టి ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థులకు ప్రశంస పత్రాలతో పాటు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్ సిఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కె.విష్ణుమోహన్, ప్రిన్సిపల్ కెఎ.రామరాజు, పీజీ కళాశాల ప్రిన్సిపల్ కానాల శ్రీనివాస్, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు పాల్గొన్నారు.

అమరవరం వసతిగృహం పున:ప్రారంభించాలి

జెసికి పూర్వ విద్యార్థుల వినతి

జెసికి వినతిని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని అమరవరంలో 1967లో ఎంఎల్‌సి కీర్తిశేషులు తోటకూరి వెంకటప్పయ్య సహకారంతో స్థాపించబడి, 2014 వరకు నిర్విరామంగా కొనసాగిన సాంఘిక సంక్షేమ వసతిగృహం(ఎస్‌సి హాస్టల్) పున్నప్రారంభం చేయాలని పూర్వ విద్యార్థులు బుధవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ హాస్టల్ ఎందరో విద్యార్థులను ఉన్నతాధికారులుగా, ఉద్యోగులుగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించిందని, అయితే ప్రాంతం ముంపు గ్రామంగా మారడంతో రాజీవ్ నగర్‌లో ఉన్నత పాఠశాల స్థాపించినప్పటికీ, హాస్టల్ సౌకర్యం లేక 34 గ్రామాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పూర్వ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఉద్యోగవిరమణ పొందిన ప్రిన్సిపల్ రెంటాల వెంకట్, బిఎస్ఎన్ఎల్ ఇంజనీర్ ఇలంగి చిట్టిబాబు, పీడీగా ఉద్యోగ విరమణ పొందిన చింతమల్ల కాంతారావు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ సీనియర్ అకౌంటెంట్‌గా ఉద్యోగ విరమణ పొందిన తోటమల్ల వెంకటి, బుయ్యన నాగేశ్వరరావు, అడ్వకేట్ మేక ఈశ్వరయ్య, సింగరేణి మాజీ జిఎం శనగ వెంకటేశ్వర్లు, శనగ రామచందర్ రావు ఉన్నారు. జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పేదలకు ఏక్ సాల్ పట్టాలివ్వాలి

సిపిఎం ఆధ్వర్యాన తహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

వినతిని అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో ఎర్రకాల మిగులు భూములు సాగులో ఉన్న పేదలకు ఏక్‌సాల్ పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన గురువారం తహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిని తహాశీల్దార్ టి.సాయిబాబాకు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ మండలంలోని ఎర్రకాలువ మిగులు భూముల్లో గత కొన్నేళ్లగా స్థానిక గ్రామాలకు చెందిన కొందరు పేదలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. సాగుదారులందరికీ పట్టాలివ్వాలని పలుమార్లు ఇరిగేషన్ అధికారులు చుట్టూ తిరిగినప్పటికీ పట్టించుకోలేదన్నారు. అయితే వారిపై అక్రమ కేసులు పెడుతూ ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలోని మధ్యాహ్నపువారిగూడెంలో గిరిజనేతరులకు అనుకూలంగా గిరిజనులపై కేసులు పెట్టి స్థానిక పోలీస్ స్టేషన్‌కి ఇరిగేషన్ అధికారులు పిలిపించడం విడ్డూరంగా ఉందని వాపోయారు. పేదలపై అక్రమ కేసులు నిలిపివేయాలని, పేదల సాగులో ఉన్న భూములకు ఏక్‌సాల్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి, మడకం కుమారి, దుర్గమ్మ, గంగా భవాని పాల్గొన్నారు.

చైన్ జెసిబి ప్రారంభం

జెసిబి ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ, మేయర్

ఏలూరు సిటీ : నగరంలో పెరుగుతున్న జనాభా, పెరుగుతున్న ఏరియా దృష్టిలో పెట్టుకొని కార్పొరేషన్ పరిధిలో శానిటేషన్‌కి సంబంధించి అధునాతన పరికరాలను సమకూర్చుతున్నామని ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య, మేయర్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.46 లక్షలతో కొనుగోలు చేసిన చైన్ జెసిబిను ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య, మేయర్ నూర్జహాన్ పెదబాబు చేతుల మీదుగా గురువారం ఉదయం వెహికల్ షెడ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో శానిటేషన్ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామన్నారు. అందులో భాగంగా చైన్ జెసిబి కొనుగోలు చేయడం జరిగిందని కంపోస్టు యార్డుకు ట్రాక్టర్ల ద్వారా వచ్చిన చెత్తను చివరి ప్రదేశం వరకు తీసుకువెళ్లడానికి, మెయిన్ డ్రెయినేజీలు, పంటకాలువలు డి సిల్టింగ్ తీసేందుకు ఉపయోగిస్తామని తెలిపారు. నగరపాలక సంస్థకు సంబంధించి గతంలో ఉన్న జెసిబి, ట్రాక్టర్లు, మినీ కాంపాక్టర్లు, కొన్ని పరికరాలు పూర్తిగా పాడైపోయి మూలన పెట్టారని కో-ఆప్షన్స్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు ఎంఎల్ఎ దృష్టికి తీసుకువెళ్లగా వాటిని ఎంఎల్ఎ పరిశీలించారు. మరమ్మత్తులు చేయగలిగేవి చేసి వినియోగంలోకి తీసుకురావడం జరుగుతుందని, లేనిపక్షంలో సంబంధిత అధికారులతో చర్చించి వాటి స్థానంలో నూతన వాహనాలు కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఎంఎల్ఎ అన్నారు. నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ నూతనంగా కొనుగోలు చేసిన చైన్ జెసిబి నగరపాలక సంస్థలో శానిటేషన్ పనులకు చాలా ఉపయోగమన్నారు. ఎంఎల్ఎ సహకారంతో ఇప్పటికే ఏలూరు నగరపాలక సంస్థలో శానిటేషన్ ప్రక్షాళన మొదలైందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారుగా రూ.3 కోట్లతో 9 ట్రాక్టర్లు, మినీ కాంపాక్టర్, డంపర్ బీన్స్, పుష్ కార్ట్స్ మొదలైనవి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఇరుకు రోడ్లలో చెత్తను సేకరించడానికి 25 క్లాప్ వెహికల్స్ విధులు నిర్వహిస్తున్నాయన్నారు. త్వరలో ఏలూరు నగరంలో ప్రధానమైన డ్రెయినేజీలను నిర్మించి వర్షాకాలంలో రోడ్లమీద నీరు నిలవకుండా ఉండేవిధంగా చర్యలు తీసేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మేయర్ నూర్జహాన్ తెలిపారు. ఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, కమిషనర్ ఎ.భానుప్రతాప్ పాల్గొన్నారు.

నల్ల రిబ్బన్లు ధరించి నిరసన

నాలుగో రోజు కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

నినదిస్తున్న మున్సిపల్ కార్మికులు, నేతలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె గురువారం నాలుగో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ఏడేళ్లుగా జీతాలు పెంచకపోవడం చాలా దారుణమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, జిఒ నెం.36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని అన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణాధ్యక్షులు ఎన్ఆర్.హనుమాన్లు, మున్సిపల్ యూనియన్ నాయకులు రంగారావు, అప్పారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

6 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల నియామకం

ఐదు టిడిపికి, ఒకటి బిజెపికి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ల జాబితాను ప్రభుత్వం ఖరారు చేసింది. పెనుగొండ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా బడేటి వీరభద్రం (టిడిపి), నూజివీడు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా కె.అరుణ (బిజెపి), నరసాపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా జక్కం శ్రీమన్నారాయణ (టిడిపి) కైకలూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పెన్మెత్స త్రినాధ్‌రాజు (టిడిపి), భీమవరం మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా కలిదిండి సుజాత (టిడిపి), పోలవరం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కె.రామారావు (టిడిపి)ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎనీమియాపై అవగాహన

కొయ్యలగూడెం : బయ్యనగూడెం ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణ అధికారి తెలిపారు. పాఠశాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా అన్ని పాఠశాల్లో పిల్లలకు రక్తహీనతను గుర్తించటానికి హిమోగ్లోబిన్ పరీక్షలు, వయసుకు తగిన బరువు ఉన్నారా, ఎత్తు ఉన్నారా, ఎదుగుదలలో లోపాలు ఏమైనా ఉన్నాయా? ఇతర ఆరోగ్య సమస్యలు గుర్తిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, హెచ్‌ఎం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు టివిలు అందజేత

నూజివీడు టౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో విలువలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యతో పాటు అక్షర పరిచయాలు, అభినయ గీతాలు, కథలను డిజిటల్ టివిల ద్వారా నేర్పాలని ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు కోరారు. గురువారం నాయకులతో కలిసి అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సప్లై చేసిన టివిలను అందజేశారు. భీమడోలు ప్రాజెక్టు పరిధిలో 126 కేంద్రాలకు టివిలను ప్రభుత్వం సరఫరా చేసిందని, వాటిని అన్ని కేంద్రాలకు పంపిస్తున్నామని సిడిపిఒ సునీల్ రాజకుమార్ చెప్పారు. త్వరలోనే నెట్ కనెక్షన్ కూడా కల్పిస్తే చిన్నారులకు మేథోవృద్ధి పెంపొందించేందుకు కృషిచేస్తామని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సర్పంచి ఏలేటి సునీత, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సంస్థాగత ఎన్నికలపై సమీక్ష

చింతలపూడి : చింతలపూడి నియోజకవర్గంలో సంస్థాగత ఎన్నికలు, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గురించి ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్, నియోజకవర్గ పరిశీలకులు కొల్ల నాగేశ్వరరావు కలిసి నియోజకవర్గ నాలుగు మండలాల పరిశీలకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సంస్థాగత ఎన్నికలు కెఎస్‌ఎస్, బూత్, క్లస్టర్, యూనిట్, గ్రామ వార్డు కమిటీలు ఈ ఆదివారం లోపు పూర్తిచేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్తలు కొడాలి వినోద్, బ్రహ్మాజీ, మండల అబ్జర్వర్లు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన

ఆగిరిపల్లి : మత్తు పదార్థాల వినియోగానికిలోనై యువత తమ భవిష్యత్తును చిత్తు చేసుకోవద్దని, మాదక ద్రవ్యాలను కలిగివున్నా, వినియోగించినా, విక్రయించిన చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆగిరిపల్లి ఎస్‌ఐ కె.శుభశేఖర్ హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం గురువారం ఆగిరిపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సిబ్బంది మానసిక వికాసానికి శిక్షణ

ఏలూరు స్పోర్ట్స్ : పోలీసు శాఖలో పనిచేసే మహిళా సిబ్బంది మానసిక వికాసంకు ప్రత్యేక మానసిక వికాస శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి వారిలో మానసిక స్థైర్యాన్ని పెంచుతున్నామని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రముఖ మానసిక వికాస నిపుణులు కోరపాటి రవికిశోర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళా సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం గురువారం మధ్యాహ్నం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మానసిక వికాస నిపుణులు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ స్ట్రెస్ లెవెల్స్‌ను ఎలా అధిగమించాలి, ఆత్మస్థైర్యాన్ని ఎట్లా పెంచుకోవాలి ఇటువంటి పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం రాష్ట్రంలో మహిళలపై, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా ఆమె వీరికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ మల్లేశ్వరరావు, డిసిఆర్‌బిసిఐ హబీబ్ భాషా, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన

పోలవరం : మండలంలోని పోలవరం, ఇటుకలకోట పంచాయతీలలో గురువారం రూ.65.10 లక్షల నిధులతో మంచినీటి ట్యాంకుల నిర్మాణాలకు ఎపి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో కూటమి నేతలు శంకుస్థాపనలు నిర్వహించారు. పోలవరం పంచాయతీలోని కమ్మరగూడెం, నూతనగూడెం, ఇటుకలకోట గ్రామంలో మంచినీటి ట్యాంకుల పనులకు కొబ్బరి కాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు కుంచే దొరబాబు, గునపర్తి చిన్ని, కరిబండి నాగరాజు, కొణతాల ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో సహకారమందించాలి

జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ భాషా

మండవల్లి : రైతులకు అందించాల్సిన సహకారాన్ని సకాలంలో అందించాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ భాషా తెలిపారు. గన్నవరం రైతుసేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ సంచాలకులు జి.వెంకటమణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ నుంచి రైతులకు వ్యవసాయంలో అందించాల్సిన సలహాలు, సూచనలతో పాటు అవసరమైన సహాయాన్ని అలసత్వం లేకుండా సకాలంలో అందించాలని అన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలైన తరుణంలో వ్యవసాయ శాఖ నుంచి రైతులకు అందవలసిన ఇన్‌పుట్ బ్యాంకు నుంచి పంట రుణాలు, పంట బీమా కార్డులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కెడిసిసి ఇండియన్ బ్యాంక్ మేనేజర్లను కలిసి బ్యాంకుల నుంచి రుణాలు పొందుతున్న రైతులతో తప్పనిసరిగా పంటల బీమా ప్రీమియంను కట్టించాలని, అదేవిధంగా కౌలు కార్డు ఉన్న రైతుకు విధిగా పంట రుణాలను సకాలంలో ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కైకలూరు సబ్ డివిజన్ వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు పాల్గొన్నారు.

పిపి కిట్లు, యాప్రాన్లు అందజేత

ఏలూరు సిటీ : నమస్తే డే కార్యక్రమం ద్వారా మున్సిపల్ కార్పొరేషన్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీల్లో పనిచేసే కార్మికుల ఆరోగ్యం, జీరో మరణాల దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆదేశానుసారం నమస్తే డే కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఛాంబర్లో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ నూర్జహాన్ చేతుల మీదుగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సెప్టిక్ ట్యాంక్ల మీద పనిచేసే కార్మికులకు పిపి కిట్లు, యాప్రాన్లు, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు అనారోగ్యానికి గురికాకుండా ఉండాలని యాప్రాన్లు, హెల్మెట్, షూస్, చేతి గ్లౌజులు, మాస్క్, కళ్లద్దాలు అందించామన్నారు. వాటితో పాటు వారికి వృత్తిపరమైన ఫొటో గుర్తింపు కార్డులు, ఆయుష్మాన్ భారత్ బీమా కార్డులు అందించామన్నారు. వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంచే విధంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన బెనిఫిట్స్ కాకుండా కార్పొరేషన్ పరంగా వారికి రావలసిన అన్ని బెనిఫిట్స్ అందజేస్తున్నామని, అదేవిధంగా ప్రయివేట్ ఆసుపత్రులు వారితో సంప్రదించి ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కమిషనర్ ఎ.భాను ప్రతాప్, అదనపు కమిషనర్ జి.చంద్రయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫారాల పంపిణీ

ఏలూరు సిటీ: కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు హేలాపురి చరిత్రలో ఎంతో గొప్పస్థానం ఉందని ఎంఎల్ఎ బడేటి చంటి వెల్లడించారు. ఆ కీర్తిని మరింత ఇనుమడింపచేసే విధంగా విద్యార్థులు విద్యలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఏలూరు కోటదిబ్బలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తన సొంత నిధులతో యూనిఫాం అందించే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి పంపిణీ చేశారు. టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నాయకులు బెల్లపుకొండ కిషోర్, కళాశాల ప్రిన్సిపల్ ఎ.రాజ్‌కృష్ణ పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

లారీ ఢీకొని సైక్లిస్ట్ మృతి

కలిదిండి : సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని లారీ ఢీ కొట్టడంతో మృతిచెందిన సంఘటన మండలంలోని గుర్వాయిపాలెం పంచాయితీ పరిధి రాంరెడ్డి నగర్ సమీపంలో రాష్ట్రీయ రహదారిపై చోటుచేసుకుంది. మృతుడు ఎ.సత్తిబాబు(45) సైకిల్‌పై ఏలూరుపాడు వెళుతుండగా వెనక నుంచి వచ్చిన ఎపి 37 టిడి 7568 బియ్యం లోడు లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. మృతుడు ఏలూరుపాడు వాసి. తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతునికి కుమారుడు, కుమార్తె, భార్య ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎఎస్ఐ కె.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు సేవా కేంద్రంలో ఫర్నీచర్ అపహరణ

జీలుగుమిల్లి : మండలంలోని దర్భగూడెం రైతు సేవా కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి తలుపులు పగలకొట్టి కంప్యూటర్, ఫర్నిచర్, ఫ్యాన్లు, ఎల్ఇడి టివిలను అపహరించినట్లు హార్టికల్చర్ అసిస్టెంట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అసాంఘిక కార్యకలాపాల నివారణే లక్ష్యం

సిఐ ఎం.వి.సుభాష్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను నివారిస్తామని సిఐ ఎం.వి.సుభాష్ తెలిపారు. ఇటీవల జంగారెడ్డిగూడెం సిఐగా బాధ్యతలను చేపట్టిన తర్వాత సర్కిల్ పరిధిలో చేపట్టబోయే కార్యకలాపాలకు సంబంధించి ప్రజాశక్తి ఆయన్ని పలకరించగా పలు అంశాలు ముచ్చటించారు.

ప్రశ్న : మీ స్వస్థలం, పోలీస్ శాఖలో మీ ప్రయాణం?

సిఐ : మాది కృష్ణాజిల్లా మచిలీపట్నం. నేను 2009 బ్యాచ్. ముందుగా ఏలూరు వన్ టౌన్ స్టేషన్లో ట్రెయినీ ఎస్ఐగా పనిచేశాను. తరువాత తాడేపల్లిగూడెం, దేవరపల్లి, ఏలూరు, దెందులూరులో ఎస్ఐగా పనిచేశాను. 2018లో సిఐగా తాడేపల్లిగూడెంలో బాధ్యతలు చేపట్టాను. తదనంతరం రాజానగరం, గణపవరం, ప్రస్తుతానికి జంగారెడ్డిగూడెంలో విధులు నిర్వహిస్తున్నాను.

ప్రశ్న : జంగారెడ్డిగూడెంలో బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇక్కడ క్రైమ్ రేటు ప్రస్తుతానికి ఎలా ఉంది. దాన్ని తగ్గించడానికి మీరు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

సిఐ : ఇక్కడ కొట్లాటలు, భార్యాభర్తల గొడవలు, చీటింగ్ కేసులు ఎక్కువగా ఉన్నాయి. అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జంగారెడ్డిగూడెం తహశీల్దార్ వద్ద బైండర్ కేసులు కట్టడం జరుగుతుంది.

ప్రశ్న : మహిళల భద్రతపై మీరు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సిఐ : జంగారెడ్డిగూడెం పరిధిలో ఎప్పటికప్పుడు ఏలూరు ఎస్‌పి, జంగారెడ్డిగూడెం డిఎస్‌పి ఉత్తర్వులు, సూచనల మేరకు మహిళల భద్రతపై సీసీ కెమెరాలు, శక్తి టీం ద్వారా వారికి రక్షణ కల్పిస్తున్నాం. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేస్తున్నాము. అలాగే స్కూల్స్, కాలేజీలలో విద్యార్థులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి మహిళా పోలీసుల ద్వారా మీటింగ్‌లు పెట్టి వారికి అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న : జంగారెడ్డిగూడెంలో యువత డ్రగ్స్ బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు? డ్రగ్స్ తీసుకున్న వారిపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సిఐ : జంగారెడ్డిగూడెం పట్టణంలో డ్రోన్ కెమెరా ద్వారా సాయంత్రం, రాత్రి సమయాల్లో ఖాళీ ప్రదేశాల్లో ఓపెన్ డ్రింకింగ్ చేసేవారిపై చర్యలు తీసుకుంటున్నాం. అలాగే స్కూలు, కాలేజీ దగ్గర విద్యార్థులను ర్యాగింగ్ చేసే వారిపై కఠినమైన చర్యలు చేపడుతున్నాము. ఈ మధ్యకాలంలో కూడా జంగారెడ్డిగూడెంలో రెండు కేజీల గంజాయిని పట్టుకోవడం జరిగింది. ఈ గంజాయి, డ్రగ్స్ తీసుకునే వారిపై కఠినమైన చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న : ప్రజలకు మీరు చెప్పాలనుకునే ముఖ్య సందేశం ఏమిటి?

సిఐ : మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు దయచేసి ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దు. పేకాట, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలు చేసే వారిపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాము. ప్రజలు కూడా పోలీసులకు సహాయపడాలి. మీ చుట్టుపక్కల అలాంటివి జరిగితే ఏ సమయంలోనైనా సరే 112 కానీ, నాకు కానీ ఎస్ఐకు కానీ సమాచారం ఇవ్వచ్చు. మీరిచ్చిన సమాచారం గోప్యంగా ఉంచుతాము. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి. వాట్సప్ ద్వారా వచ్చే లింకులను ఓపెన్ చేయకండి.

చిట్ - చాట్

ప్రశ్న: పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగేలా మీరు తీసుకునే చర్యలు ఏమిటి?

సిఐ : ప్రజలందరూ స్వేచ్ఛగా స్వతంత్రంగా జీవించడానికి వారి హక్కులకు భంగం కలిగించకుండా వారికి భద్రత కల్పిస్తున్నాం. సర్కిల్ పరిధిలో ఎవరికైనా ఎప్పుడైనా ఏ ఇబ్బంది వచ్చినా 24 గంటలు కూడా అందుబాటులో ఉంటాము. మీకు ఎలాంటి ఆపద వచ్చినా వెంటనే ఫోన్ ద్వారా సమాచారం అందించవచ్చు. సైబర్ నేరాలకు పాల్పడే వారిపై ఫిర్యాదు చేయాలంటే 1930కి ఫోన్ చేయండి. అలాగే గంజాయి, డ్రగ్ తీసుకునేవారు, అమ్మేవారిపై ఫిర్యాదు చేయాలంటే 1972కి తెలియజేయగలరు.

ఆశ్రమ పాఠశాలల తనిఖీ

కుక్కునూరు: మండలకేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలను డిప్యూటీ డైరెక్టర్ శ్రీవిద్య, అసిస్టెంట్ మోనిటరింగ్ అధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. అదేవిధంగా మాధవరం బాలుర ఆశ్రమ పాఠశాలను డివైఇఒకె ఆర్‌పి.కుమార్, అకడమిక్ మోనిటరింగ్ అధికారి శిరమయ్య, ఐటిడిఎ జిసిడిఒ రాజేశ్వరి పరిశీలించారు. ఈ తనిఖీలో విద్యార్థుల విద్యాస్థాయి, బోధన పద్ధతులు, మౌలిక సదుపాయాలు, భోజన వసతులు, ఎస్ఆర్‌కె విద్యా కిట్లు, యూనిఫామ్‌ల పంపిణీ వంటి అంశాలపై వివరాలు సేకరించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో సంభాషించిన అధికారులు ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులను శ్రద్ధగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయిని మంగమ్మ, బాలుర ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్య రావు, సిబ్బంది పాల్గొన్నారు.

డివైఇఇగా భీమేశ్వరరావు

ఉంగుటూరు: ఉంగుటూరు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డివైఇఇ)గా రాళ్లపల్లి భీమేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు కమర్షియల్ ఎఇగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై డివైఇఇగా వచ్చారు. గతంలో ఆయన నారాయణపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఎఇగా పనిచేశారు. ఆపై నాగులపల్లిలో కొంతకాలం పనిచేసి ఏలూరు బదిలీ అయ్యారు. అక్కడ నుంచి ప్రమోషన్‌పై తిరిగి నారాయణపురం సబ్ స్టేషన్(ఉంగుటూరు సబ్ డివిజన్ కార్యాలయం)కు వచ్చిన ఆయన్ను ఎఇ శ్రీరామ్, సబ్ ఇంజనీర్ శివకుమార్, ఎల్ఐ వీరభద్రరావు, లైన్‌మెన్ పి.నాగరాజు, వెంకటేశ్వరరావు, విద్యుత్‌శాఖ ఉద్యోగులు కలిసి అభినందనలు తెలిపారు.

అన్యాయంగా ఇల్లు పీకేశారు..

తల్లీ కొడుకు ఆందోళన

ఉంగుటూరు : చేబ్రోలు టౌన్ హాలు ఆవరణలో గత 30 సంవత్సరాలుగా ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నా దౌర్జన్యంగా పీకేశారని గాలి లక్ష్మి, ఆమె కుమారుడు సూరిబాబు గురువారం ఆందోళన వ్యక్తంచేశారు. చేబ్రోలు టౌన్ హాలు వద్ద(రిక్రియేషన్ క్లబ్) అప్పటి నిర్వాహకులు, కీర్తిశేషులు డాక్టర్ గోపు ఆదిరెడ్డి మాకోసం ఇంటిని నిర్మించారన్నారు. ఆనాటి నుంచి నేటి వరకూ అక్కడే వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నామన్నారు. కూలీ పనికి వెళ్లి వచ్చే సరికి ఎలాంటి నోటీసు ఇవ్వకుండా బలవంతంగా ఇంటిని కూల్చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు. తగు న్యాయం చేయాలని అధికారులను ఆశ్రయించినా ఎవరూ స్పందించడం లేదని వాపోతున్నారు. ఆక్రమణల తొలగింపు అంశం పంచాయతీ పరిధికి వస్తుందని తమ దృష్టికి రాలేదని ఇన్‌ఛార్జి తహశీల్దార్ పూర్ణచంద్రరావు అన్నారు. అది టౌన్ హాలుకు సంబంధించిన స్థలంలో ఉన్న ఇళ్లు అని నివాసదారులకు ఎలాంటి హక్కులు లేవని నిర్వాహకులు చెబుతున్నారు.

పలుచోట్ల సుపరిపాలనలో తొలిఅడుగు

ముదినేపల్లి : మండలంలోని వడాలి గ్రామంలో 82, 83, 84 బూత్‌లలో సుపరిపాలనలో తొలి అడుగు ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ముందుగా వడాలి గ్రామంలో 82, 83, 84 బూత్‌లలో ఇంటింటా కార్యక్రమం నిర్వహించి విజయవంతంగా పూర్తిచేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో మిగిలిన బూత్‌లలో ఈ కార్యక్రమాన్ని త్వరగా పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు నక్క అప్పారావు, కార్యదర్శి కట్టా రామయ్య, యూనిట్ ఇన్‌ఛార్జి వీరమల్లు శేషు, బూత్ కన్వీనర్లు కె.కోటయ్య, సిహెచ్.నాగరాజు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ: పేదల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారన్నారు. స్థానిక 7వ డివిజన్ పాండురంగా థియేటర్ వద్ద నుంచి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఏలూరు నగర టిడిపి అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

దెందులూరు: ఫారెస్ట్ నిబంధనల పేరుతో కొల్లేరు ప్రజలను అధికారులు ఇబ్బంది పెట్టడం సరికాదని, కొల్లేరు ప్రజలకు అన్ని విధాల అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలియజేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఏలూరు రూరల్ మండలంలోని గుడివాకలంక, ప్రతికోళ్ల లంక, పైడి చింతపాడు, కొక్కిరాయలంక గ్రామాల్లో పర్యటించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలి

చింతలపూడి: రైతులు తక్కువ ఖర్చుతో ఈ ద్రావణాన్ని తయారు చేసుకుని ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి పరచుకోవాలని, దీనివల్ల ఖర్చులు తగ్గి దిగుబడులు మెరుగుపడతాయని డిజిటల్ ఫెసిలిటేటర్ మరికంటి గోపాలకృష్ణ తెలిపారు. మండలంలోని రాఘవపురం గ్రామంలో గురువారం కిసాన్ అంగడి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రం, బయోరిసోర్స్ సెంటర్ ఆధ్వర్యాన పంటల ఎదుగుదలకు, సూక్ష్మధాతు లోపాలను తగ్గించేందుకు 70 లీటర్ల 'ఎగ్ అమినో యాసిడ్' ద్రావణాన్ని తయారు చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి నరసింహ, బసవరావు పాల్గొన్నారు.

మిగులు భూములు కూడా వదలట్లేదు!

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కనుమరుగౌతున్న మట్టి

మిగులు భూమిలో కనమరుగైన మట్టి

మండలవ్యాప్తంగా మట్టి మాఫియా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పెద్దపెద్ద కొండల్లాంటి గట్లను కూడా మాయం చేసేస్తున్నారు. కొంతకాలంగా చింతలపూడి ఎత్తిపోతల పథకానికి సంబంధించి తవ్విన కాల్వగట్లను మట్టి మాఫియాకు ఆదాయ వనరులుగా చేసుకొని అక్రమార్జనకు తెర లేపిన అక్రమార్కులు ఇటీవల కాలంలో మండల పరిధిలో ఉన్న మిగులు భూములను కూడా వదలట్లేదు. రాత్రీ పగలు తేడా లేకుండా కొంతమంది అక్రమార్కులు మిగులు భూముల్లో మట్టిని వ్యాపారం చేసేస్తున్నారు. సొంత అవసరాలతో పాటు ఒక్కో ట్రిప్‌ను 600 నుంచి 1000 వరకు అమ్ముతూ మట్టి వ్యాపారంతో మాఫియా లక్షలు గడిస్తోందంటే అతిశయోక్తి కాదు. దీనిపై సంబంధిత అధికారులు ఎవరూ కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇక రెవెన్యూ వ్యవస్థ అంతా ఇన్‌ఛార్జుల ఏలుబడిలో ఉండటంతో పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇలాగే వదిలిస్తే చింతలపూడి గట్ల మాదిరిగానే మిగులు భూములలో మట్టి కూడా కనుమరుగయ్యే పరిస్థితి లేకపోలేదని ప్రజాసంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగులు భూముల్లో అక్రమంగా మట్టి తరలింపుపై అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు తెలిపారు.

పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

బాధ్యతలు స్వీకరిస్తున్న కమిటీ సభ్యులు

ప్రభుత్వం చేత నియమించబడిన మండలంలోని పోతిరెడ్డిపల్లి పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పిఎసిఎస్ అధ్యక్షులుగా అక్కినేని బెనర్జీ, సభ్యులుగా మందపాటి తిరుపతయ్య, జుజ్జువరపు రాణి, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కొమ్మన నాగేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు శ్రీనివాసరావు, పోతిరెడ్డిపల్లి మాజీ సర్పంచి అక్కినేని చంద్రశేఖర్, టిడిపి గ్రామ అధ్యక్షుడు సుంకర బాబి, టిడిపి నాయకులు ఎన్ఆర్ఐ అక్కినేని ప్రేమ్ తదితరుల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు రైతులు, రైతు నాయకులు మాట్లాడుతూ 100 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న పోతిరెడ్డిపల్లి సహకార సంఘాన్ని కొత్తగా ఎన్నికైన త్రిసభ్య కమిటీ మరింత ముందుకు తీసుకు వెళ్లడానికి కృషి చేయాలన్నారు. రైతులకు సంఘ పరిధిలో అందించాల్సిన సేవలను ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు అక్కినేని ఆంజనేయ ప్రసాద్, సంఘ కార్యదర్శి ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు యాప్‌ల భారం తగ్గించాలి

యూనియన్ గౌరవాధ్యక్షులు విజయలక్ష్మి

నూజివీడు టౌన్ : అంగన్వాడీలకు తీవ్ర ప్రతిబంధకంగా నిలిచిన యాప్స్‌ను నిలిపివేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు విజయలక్ష్మి, జిల్లా నాయకులు మాణిక్యం డిమాండ్ చేశారు. నూజివీడు పట్టణంలోని సుందరయ్య భవన్‌లో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ప్రాజెక్టు మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాప్స్ అప్లోడింగ్‌తో మరింత పని భారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నూజివీడు ప్రాజెక్టు అధ్యక్షురాలుగా వై.ఆదిలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా పి.రాజకుమారి ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.

రెగ్యులర్ ఉద్యోగిని నియమించండి

పంచాయతీ పాలకవర్గ సభ్యులు

పోలవరం : మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి స్థానంలో రెగ్యులర్ ఉద్యోగిని నియమించాలని పంచాయతీ పాలకవర్గ సభ్యులు గురువారం తెలిపారు. కార్యదర్శి ఇటీవల బదిలీపై వెళ్లడంతో ఇన్‌ఛార్జి భాధ్యతలు నిర్వహిస్తున్న కార్యదర్శి పంచాయతీ కార్యకలాపాలు పట్టించుకోవడం లేదని, దీని వల్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పారిశుధ్యం పనులు లేక పంచాయతీ అభివృద్ధికి నోచుకోకుండా పోతుందని, అధికారులు స్పందించి తక్షణమే కార్యదర్శి స్థానాన్ని రెగ్యులర్ ఉద్యోగితో భర్తీ చేయాలని కోరారు. పాలకవర్గ సభ్యులు మంగిన కొండ, మంగిన పోశీరత్నం, మేడుం పార్వతి, పొట్నూరి నారాయణరావు ఉన్నారు.

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మున్సిపల్ ఏరియా, శివరావుపేట, దాసరి కమర్షియల్ కాంప్లెక్స్, 4వ ఫ్లోర్, డోర్‌నెం.3-14-3 కాపురస్తులు దాసరి తరుణ్‌గారి భార్య దాసరి యామిని తేజస్విని అను నా యొక్క ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. ఒరిజినల్ దస్తావేజు నెం.క్రిష్ణాజిల్లా, మచిలిపట్నం మండలం, గారాల దిబ్బ గ్రామ పంచాయితీ ఏరియాలోని బందరు వెస్ట్ మున్సిపల్ లిమిట్స్ వెలుపల ఏరియాలో గల రీ సర్వేనెం.233లో గల పురా య.4-06 ట్లులో మీకు విక్రయించిన య.2-00ట్లు స్థిరాస్తి శేరిపల్లం భూమికలదు. సదరు ఆస్తికి సంబందించిన నా పేరున గలది. 22-03-2024 సం॥తేదీ నాటి నెం.21176/2024 గల ఒరిజినల్ దస్తావేజును ది.4-07-2025 తేదీన ఒక కవరులో పెట్టుకొని మా ఇంటి వద్ద నుండి గునుపూడి మార్కెట్ యార్డ్ దగ్గర ఉన్న సబ్‌రిజిస్ట్రారు ఆఫీసుకు వెళ్తుండగా మార్గమధ్యలో నర్సయ్య అగ్రహారం పరిసర ప్రాంతాలలో సదరు దస్తావేజు పెట్టిన కవరు పడిపోయినది. ఎంతవెతికినను దొరకలేదు. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

దాసరి యామిని తేజస్విని, W/o.దాసరి తరుణ్, డోర్‌నెం.3-14-3, దాసరి కమర్షియల్ కాంప్లెక్స్, 4వ ఫ్లోర్, శివరావుపేట, భీమవరం, ప.గో.జిల్లా.

కేన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

CanFinHomes Ltd
(Sponsor: CANARA BANK)
HOME LOANS ♦ DEPOSITS
Translating Dreams into Reality

భీమవరం బ్రాంచ్,
బ్రాంచ్ చిరునామా : ప్లాటు నెం.4, యస్‌విఆర్ టవర్స్, జె.పి.రోడ్, భీమవరం, ఆంధ్రప్రదేశ్-534201
ఫోన్ : 08816-297744, 7625013254
e-Mail : bhimavaram@canfinhomes.com

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1)) స్థిరాస్తి కొరకు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని క్రింద **కేన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారునకు సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ సదరు నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొనబడిన బకాయి **రూ.23,48,144/- (అక్షరాల ఇరవై మూడు లక్షల నలభై ఎనిమిది వేల నూట నలభై నాలుగు రూపాయలు మాత్రమే)** మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం భవిష్యవడ్డీ మరియు ఇతర అయిన ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు మొ॥వి చెల్లించవలసినదిగా **ఋణగ్రహీతలు : శ్రీ బొడ్డు శ్రీనివాస రావు (ఋణగ్రహీత) మరియు శ్రీమతి బొడ్డు ధనలక్ష్మి (సహ-ఋణగ్రహీత)** గార్లను కోరుతూ **తేది.02.05.2025 న డిమాండ్ నోటీసు** జారీచేశారు.

ఋణగ్రహీతలు సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 8తో కలిపి చదువుకొనవలసిన సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు **తేది.02.05.2025** న దిగువ వివరించిన ఆస్తిని **స్వాధీనత** తీసుకొన్నారు.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తి విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించవలెను.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైన జరిపినచో **కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్** వారి ఛార్జీకి **రూ.23,48,144/-** మరియు వడ్డీలకు లోబడి ఉంటాయి.

స్థిరాస్తి వివరములు

పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం సబ్-డివిజన్, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ, పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం సబ్-రిజిస్ట్రీ, తాడేపల్లిగూడెం మండలం, తాడేపల్లిగూడెం టౌన్ 24వ వార్డు, సమీప డోర్ నెం.11-28-1/4గా గల 202 చ.గ.లు విస్తీర్ణం యావదాస్థి నకు **హద్దులు : తూర్పు** : 4 అ.లు వెడల్పు రోడ్డు---28.00 అడుగులు, **దక్షిణం** : కారాడ సత్తెమ్మ గారి స్థలము---62.00 అడుగులు, **పడమర** : వీధి---29.00 అడుగులు, **ఉత్తరం** : గురజాని సీతమ్మ గారి సరిహద్దు గోడ---66.00 అడుగులు.

తేది : 08.07.2025
ప్రదేశం : భీమవరం

సం/- అధీకృత అధికారి
కేన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.P.No.18/2024
(Debtor Insolvency)

Between:
తాడికొండ నాగేశ్వరరావు ...పిటీషనర్
అండ్
శ్రీ చల్లంచర్ల రామాంజనేయగుప్త & 14 అదర్స్ ...రెస్పాండెంట్స్

To.
4th Respondent :
Sri Kasireddi Syambabu, S/o.Ramarao, Male, Age 60 Years, Business, R/o.N.S.Raju Apartment, Housing Board colony, Tadepalligude, W.G.Dt., A.P. Mobile No.9440111189, 8074126899.

పై నెంబరు గల గ్రంథములో మహారాజశ్రీ కోర్టు ద్వారా 4వ రెస్పాండెంట్‌కి పలుమార్లు నోటీసులు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మహారాజశ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ఉత్తర్వుల ప్రకారము ది.**24-07-2025**వ తేదీన ఉదయం 10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట తమరు స్వయంగా గానీ, లాయరు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలియపర్చవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానము చేయబడును అని యిందుమూలముగా తెలియజేయడమైనది.

//By the Court Order//
Sd/- Ungarala Siva Kumar
Advocate for Petitioner,
Cell:9246665718/19.
Tadepalligudem,
Dt:18-07-2025

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మున్సిపల్ ఏరియా, శివరావుపేట, డి.ఎన్.ఆర్.కాలేజీ వెనుక రామలక్ష్మణనగర్, భీమాల వారి వీధి, డోర్‌నెం.25-9-245/1 కాపురస్తులు అప్పక అనంత వెంకటరత్న ఫణిందర్ గారి భార్య అప్పక మాధురి అను నా యొక్క ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. దస్తావేజు నెం.క్రిష్ణాజిల్లా మచిలిపట్నం మండలం, గారాల దిబ్బ గ్రామ పంచాయితి ఏరియాలోని బందరు వెస్ట్ మున్సిపల్ లిమిట్స్ వెలుపల ఏరియాలో గల రీ సర్వే నెం.233లో గల పూరా య.4-06ట్లులో మీకు విక్రయించిన య.2-06ట్లు స్థిరాస్తి శేరిపల్లం భూమి కలదు. సదరు ఆస్తికి సంబంధించిన నా పేరున గల ది.22-03-2024 సం॥తేది నాటి నెం.21176/2024రు గల ఒరిజినల్ దస్తావేజును ది.4-07-2025 తేదీన ఒక కవరులో పెట్టుకొని మా ఇంటి వద్ద నుండి గునుపూడి మార్కెట్ యార్డ్ దగ్గర ఉన్న సబ్‌రిజిస్ట్రరు ఆఫీసుకు వెళ్తుండగా మార్గమధ్యలో నర్సయ్య అగ్రహారం పరిసర ప్రాంతాలలో సదరు దస్తావేజు పెట్టిన కవరు పడిపోయినది. ఎంతవెతికినను దొరకలేదు. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

అప్పక మాధురి, W/o.అప్పక అనంత వెంకటరత్న ఫణిందర్
డోర్‌నెం.25-9-245/1, రామలక్ష్మణనగర్, భీమవరం, ప.గో.జిల్లా.

IN THE COURT OF THE 3rd ADDL. DISTRICT JUDGE, BHIMAVARAM

Appeal No.6/2024

బిట్వీన్ :
కట్టానాగరాజు & అనదర్ ...అప్పిలెంట్లు
And
వేగేశ్న వంకట క్రిష్ణంరాజు & అదర్స్ ...రెస్పాండెంట్లు

రెస్పాండెంట్లు అడ్రస్ :
2వ రెస్పాండెంట్ : మోటుపల్లి శ్రీనివాస్, S/o.చిన్న సత్యన్నారాయణ, భీమవరం.
4వ రెస్పాండెంట్ : CH.దుర్గాప్రసాద్, S/o.అచ్చుయ్య, గునుపూడి, భీమవరం.
5వ రెస్పాండెంట్ : దేశిన వెంకట్రావు, S/o.సాంబశివరావు, వడలి, ముదునేపల్లి మండలం, కృష్ణాజిల్లా.
6వ రెస్పాండెంట్ : బొర్రా నరసింహారావు, S/o.వీరభద్రరావు, పాలకొల్లు, పాలకొల్లు మండలం టౌన్.

పై నంబరు దావాలో వాదికి పలుమార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకముగా నిరాకరించినందున ఈ పత్రిక ప్రకటన ద్వారా నోటీసు అమలు చేయడమైనది. కావున పైకోర్టు వారి ఎదుట ది.11-08-2025 ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని ప్లీడర్ గారి ద్వారా గాని హాజరై పై దావా గ్రంథంలో మీ సమాధానం తెలియజేయవలెను. లేని యెడల మీ పై శ్రీకోర్టు వారు పరోక్షముగా ఉత్తర్వులు జారీ చేసి తీర్మానము చేయుదురు అని ఇందుమూలంగా మీకు తెలియచేయటమైనది.

ఆరేపల్లి ఏడుకొండలు
అడ్వకేట్, బొండాడ.
కాళ్ళ మండలం, ప.గో.జిల్లా.

కోర్టు ప్రకటన

BEFORE THE WORKMENS COMPENSATION AUTHORITY ELURU, DT.,
(ASST. COMMISSIONER OF LABOUR, ELURU)
W.C.No.3/2025

Between:
1.Dowluri Jyothi and Others ...Petitioners/ Applicants
And
1.Sri Chigurupati Nagaraju and another ...Respondents/Opp.Parties

1st Respondent: Chigurupati Nagaraju, S/o.Venkateswara Rao, Hindu, Male, Aged not known, Owner of Tractor and Trailer bearing No.AP 37 TC 4639 and AP 27 TU 9128, R/o.D.No.3-149, Bhimadole Village and Mandal, Eluru Dist.

పై నెంబరు దావా గ్రంథములో 1వ రెస్పాండెంట్ ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించిననూ మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారు (సబ్‌స్టిట్యూట్ సర్వీస్) పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు అమలుకు ది.**15-07-2025**న ఆర్డరు వేసినారు. ది.**04-08-2025** తేదీన వాయిదా మీరు పై వాయిదా తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టులో స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేనియెడల మీపై పరోక్షమున తీర్మానించబడును.

G.Krishnaprasadrao
Advocate, Bhimadole (M)
Eluru Dist., A.P. Cell:8923456777

IN THE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE : ELURU, WEST GODAVARI DISTRICT

E.P.No.116/2024
in
ARBITRATION CASE
No.ARC/FSBFL/1314/2022
(On the file of Arbitral Triunal of Justice of Thiru A.Manivasakan, Villivakkam, Chennai, Tamil Nadu)

Between:
M/s.Five Star Business Finance Limited Represented by it's Authorized Signatory ...DHr/Petitioner/Claimant
And
1.Killada Satish
2.Killada Vijaya Lakshmi ...JDR's/Respondent

పై నెంబరు గ్రంథములో జె.డి.ఆర్. స్వాధీన హక్కు భుక్తములో ఉన్న ఈ దిగువ ఇ.పి షెడ్యూలు ఆస్తిని ది.**11-08-2025**వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట బహి రంగముగా వేలము వెయ్యబడును. కావున వేలముపాటలో పాల్గొనే వారు తమ ఆధార్ కార్డుతో ఉదయం గం.10.30 ని॥లకు వచ్చి వేలములో పాల్గొనవలసిందిగా కోర్టు ఆర్డరు ప్రకారం ఇందుమూలముగా తెలియజేయడమైనది.

SCHEDULE

All that piece and parcel of the Vacant land bearing Plot No.46, Situated in Polasanipalli Village an gram panchayat, Bhimadolu mandal, West Godavari District, Comprised in R.S.286, GP.No.15/2006, land measuring an extent of 222 sq yards or sq meter, and Bounded on the :
North : Plot No.45-50 feet,
West : Plot No.41-40 feet,
East : Plot No.33 feet width Road - 40 feet.
South : Plot No.47-50 feet.
With all easementary rights there on.

The above property is situated with in the Registration District of West Godavari present Eluru District and Registration Sub-Registrar of Bhimadole.
D.H.R Value of Rs.16,00,000
Amina Value is Rs.15,00,000

గొర్రెల సతీష్ (GSKN),
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 9848611998